క్లుప్తంగా

ఏబీఎం చర్చిలో విరామబైబిల్ పాఠశాల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని ఏబీఎం మెయిన్ చర్చిలో మంగళవారం విరామబైబిల్ పాఠశాల ప్రారంభించారు. మూడు రోజుల పాటు బైబిల్ పాఠశాలలో తరగతులు జరుగుతాయని చర్చి పెద్దలు తెలిపారు. రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ఎం.మేరిలలిత ఆధ్వర్యంలో పిల్లలకు ఆటపాటలతో కూడిన గీతాలు, బైబిల్ పఠనం, క్విజ్ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

శ్రీశైలంప్రాజెక్ట్: విద్యుదాఘాతంతో సున్నిపెంటకు చెందిన షేక్.నూరున్నీసా(48) మంగళవారం ఉదయం మృతిచెందింది. సులేమాన్ సెంటర్‌లో పిండిమర నడుపుతున్న షేక్ ఉమర్ భార్య నూరిన్నీసా మంచినీరు వస్తుండగా మోటారు వేసి నీళ్లుపట్టుకుంది. అనంతరం మోటారు తీస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ ఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.

మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

నందికొట్కూరు: మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసులు పరిష్కారం చేయడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి దివ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేసులు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్న కక్షిదారులు తమ కేసులను హైకోర్టు ఏర్పాటు చేసిన ముగ్గురు న్యాయవాదులను సంప్రదించి, సదరు న్యాయవాదులకు తెలిపి ఇరువైపుల వారు చర్చించుకొని రాజీమార్గమున పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభ్యర్థుల గెలుపోటములపై ఉత్కంఠ

జూపాడుబంగ్లా: సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ పర్వం ముగియటంతో అభ్యర్థుల గెలుపు, ఓటములపై గ్రామాల్లో ఉత్కంఠ నెలకొంది. చోట మోటా నాయకులు గంటలు తరబడి చర్చించుకుటున్నారు. అభ్యర్థుల బలాబలాలతో చర్చ మొదలుపెట్టి ఓటర్లకు పంపిణీ చేసిన లెక్కలు, ఓటర్లు ఏ పార్టీవైపు అధికంగా మొగ్గుచూపించారనే విషయాలపై చర్చించుకుంటున్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు ఇచ్చిన మేనిఫెస్టోలు ఎంతవరకు ప్రభావింతం చేశాయనే విషయమై బేరీజు వేస్తున్నారు. కొంత మంది మా అభ్యర్థి గెలుస్తాడంటే, కాదు మా అభ్యర్థి గెలుస్తాడంటూ ఇరువర్గాల నాయకులు బెట్టింగులు కాస్తున్నారు.

తాటిపాడులో ఉపాధి పనులు కల్పించండి

జూపాడుబంగ్లా: తాటిపాడులో ఉపాధి పనులు కల్పించాలని గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు కోరుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కొనసాగుతున్నా తాటిపాడులో పక్షం రోజుల నుంచి పనులు జరగటం లేదని పేర్కొంటున్నారు. గ్రామంలో 780 జాబ్‌కార్డులుండగా 580 మంది వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్లేవారున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లేక పోవటంతో కూలీలకు పనుల్లేక పస్తులుండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉపాధిపనులు కల్పించాలని ఉపాధిహామీ పథకం ఈసీ, ఏపీఓ లను కోరినా వారు పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే గ్రామంలో పనులు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కొత్తపల్లిలో వర్షం



దుద్యాల వద్ద పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. బండి నాయిని పాలెం, గువ్వలకుంట్ల, వీరాపురం, బావాపురం గ్రామాలలో ఓ మోస్తారు వర్షం కురిసింది. నందికుంట, దుద్యాల గ్రామాలలో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. 30 నిమిషాల పాటు ఎడతెరిపి లేని వర్షంతో దుద్యాల, నందికుంట, ఆత్మకూరు గ్రామాల మధ్య పంటపొలాలలో వర్షపునీరు చేరింది. దీంతో దుక్కులకు అనుకువగా ఉంటుంది రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు దుద్యాల, కొక్కెరం రహదారిలో వేపచెట్టు విరిగి పడింది. రోడ్డుకు పక్కగా పడడంతో ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదు.

వేసవి దుక్కులు కీలకం

- సస్యరక్షణతోనే అధిక లాభాలు
- సుమారు 40 వేల హెక్టార్లలో ముమ్మరంగా వేసవి దుక్కులు
- డివిజన్ వ్యవసాయాధికారి విజయశేఖర్ సూచనలు



వేసవి దుక్కులు దున్నుతున్న రైతన్న

నందికొట్కూరు: వ్యవసాయంలో రైతులు సస్యరక్షణ చర్యలు పాటించినప్పుడే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులను సాధించగలరు. విచక్షణ రహితంగా పురుగు మందులను వాడడం వలన ఖర్చులు పెరగడంతో పాటు దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని డివిజన్ వ్యవసాయ అధికారి విజయశేఖర్ సూచిస్తున్నారు. అలాగే తెగుళ్ల నివారించవచ్చంటున్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా వేసవి దుక్కులు సుమారు 2 లక్షల హెక్టార్లు, నందికొట్కూరు నియోజకవర్గంలో 40 వేల హెక్టార్లకు పైగా దుక్కులు రైతన్నలు దున్నుతున్నారు. భూసార పరీక్షలకు దుక్కులు అనుకూలంగా ఉంటుంది. దుక్కుల వలన లాభాలపై రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పంట అవశేషాలు తొలగింపు

గత పంట తాలుకు అవశేషాలను పూర్తిగా తొలగించడం వలన కొన్ని పురుగుల కోశస్థదశలను నాశనం చేయవచ్చు. ఆ తరువాత సాగు చేసి పంటకు ఈ పురుగులు ఆశించకుండా చేయవచ్చు. ముఖ్యంగా వరి పంటలో ప్రధానమైన కాండం తొలిచే పురుగును ఈ పద్ధతి ద్వారా నియంత్రివచ్చు.

వర్షాకాలానికి ముందే దున్నాలి

వర్షాకాలం రాక ముందే భూమి మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేయడం వలన తొలకరి వర్షాలకు నేల మొత్తబడి భూమిలోకి నీళ్ల ఇంకుతాయి. దుక్కులు లోతుగా, అడ్డంగా వాలుగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తేమను నిల్వ చేసే సామర్థ్యం పెరుగుతుంది. దుక్కి దున్ని భూమిని ఎండబెట్టడం ద్వారా కలుపు మొక్కలను నివారించవచ్చు. దుక్కులు దున్నే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులను, చెరువుల మట్టిని వేయాలి. దీంతో భూమి సారవంతమవడమే కాకుండా నీటి నీల్వ శాతం చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవిలో దుక్కి దున్నడం ద్వారా భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరీక్షకు ఉపయోగపడుతాయి.

లోతు దుక్కులతో పురుగులు నాశనం

వరిలో కాండం తొలిచే పురుగు, రెప్పవాల్చు పురుగు, లద్దె పురుగులు, పత్తిలో లద్దెపురుగులు, శనగపచ్చ పురుగులు, మిరప, టామాట, కూరగాయ మొక్కలలో కాయతొలుచు పురుగు వివిధ పంటల్లో వచ్చే పురుగులు లోతు దుక్కులు దున్నడం ద్వారా నశిస్తాయి.

కలుపు మొక్కల నివారణ

వేసవిలో లోతు దుక్కులు దున్నడం వలన కలుపు మొక్కలను నాశనం చేయవచ్చు. పంట కాలం ముగిశాక భూములను ఖాళీగా ఉంచడం వలన పంటలను ఆశించే చీడపురుగులు, తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. దుక్కులు దున్నడం వలన చీడపురుగుల గుడ్లు, అవశేషాలు వెలుపలికి వచ్చి వేసవిలో బయట ఉష్ణోగ్రతలకు చచ్చిపోతాయి.

వేసవి దుక్కులతో చీడపీడల నివారణ

వేసవి దుక్కులు లోతు దున్నడంతో అన్ని రకాల పురుగుల నివారణ సాధ్యమవుతుంది. కలుపు మొక్కలను నివారించడం జరుగుతుంది. వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కేవలం ఒక పంటకు రూ.లక్షల ఖర్చు పెట్టడం కన్నా చక్కటి యాజమాన్య పద్ధతి పాటించడం వలన సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. సాగుకు ముందే భూసార పరీక్ష చేయించుకుంటే వాటి అనుగుణంగా సూక్ష్మపోషకాలను సూచనల మేరకు వినియోగించుకోవచ్చు. మొలకలు నాటిన అనంతరం చీడపీడల నివారణ కోసం లక్షలు ఖర్చు చేయకుండా వేపనూనె, పంచగవ్యలతో పంటలకు సాగుచేసే తెగుళ్ల సోకకుండా ముందుస్తు చర్యలు చేపట్టవచ్చు. వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని బిందు సేద్యం పాటించడం ప్రయోజనకరం.

– విజయశేఖర్, ఏడీఏ నందికొట్కూరు

గుడిసె దగ్ధం



గుడిసె నుంచి ఎగిసిపడుతున్న మంటలు

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో మంగళవారం నాగేషులు అనే వ్యక్తికి చెందిన పూరిగుడిసె దగ్ధమైన సంఘటన జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఇంట్లో భార్య వంట చేస్తుండగా పొయ్యిలో మంటలు చెలరేగి గుడిసెకు నిప్పంటుకుంది. ఆమె వెంటనే ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మంటలు విపరీతంగా చెలరేగి గుడిసె పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, దుస్తులు, నగదు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.3లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడండి



అధికారులకు సూచనలిస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలం : శ్రీశైల క్షేత్రంలో శని, ఆది, సోమవారాలతో పాటు సెలవు రోజుల్లో ఆయా కూడళ్ల వద్ద పార్కింగ్ సమస్య తలెత్తకుండా సంబంధిత సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈఓ పెద్దిరాజు అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిపాలనలో భాగంగా మంగళవారం అధికారులతో కలసి వాహనాల రద్దీగా ఉండే కూడళ్లు, రహదారులను పరిశీలించారు. యాదవ సత్రం, జగద్గురు సత్రం, ఫ్యూస్ ఆఫ్ కాల్ ఆఫీస్, దేవస్థానం వైద్యశాల చౌరస్తా తదితర ప్రదేశాలలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. పెద్ద సత్రం ముందు ఉన్న రోడ్డు ఎత్తుపల్లంగా ఉందని, అక్కడ సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాధ్యమైనంత వరకు ప్రదేశాల వద్ద రహదారులను సరి చేయాలని సూచించారు. దేవస్థానం అన్నపూర్ణ భవన్ పక్కనే చుట్టూ పటిష్టమైన కంచెను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట దేవస్థానం ఈఈ మురళీధర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి డీఈ సుబ్బారెడ్డి, జైపాల్ నాయక్, సహాయ స్థపతి జవహర్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో 84.79 శాతం పోలింగ్



జూపాడుబంగ్లా మండలంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా 86.47శాతం
- పాములపాడు మండలంలో అత్యల్పంగా 83.47శాతం నమోదు
- పురుషుల కంటే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్న మహిళలు

నందికొట్కూరు: నియోజకవర్గంలో సోమవారం సుమారు 84.79 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసు తెలిపారు. నియోజకవర్గంలో జూపాడుబంగ్లా మండలంలో అత్యధికంగా 86.47శాతం, పాములపాడు మండలంలో అత్యల్పంగా 83.47శాతం పోలింగ్ నమోదయ్యిందని చెప్పారు. కాగా, పురుషుల కంటే మహిళలే అధికంగా ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మండలాల వారీగా పోలింగ్ వివరాలు..

- జూపాడుబంగ్లా మండలంలో పురుషులు 14,668 మంది ఓటర్లకు గాను 12,930మంది ఓటు వేయగా, మహిళలు 15, 383 గాను 13,055 ఓట్లు వేయడంతో మొత్తం-25,985 ఓట్లు పోలవ్వగా 86.47 శాతం నమోదయ్యింది.
- కొత్తపల్లి మండలంలో పురుషులు 12,640 గాను 10,741, మహిళలు 12,839 గాను 10,695, ఇతరులు-01 మొత్తం-21,437 మంది ఓట్లు వేయగా 84. 13 శాతం పోలింగ్ నమోదయ్యింది.
- మిడుతూరు మండలంలోని పురుషులు 17,728 గాను 15,354, మహిళలు 18,507 గాను 15,173, ఇతరులు 01 ఓటు హక్కు వినియోగించుకోగా మొత్తం 30,528 ఓట్లు పోలై 84.25 శాతంగా ఓటింగ్ నమోదయ్యింది.
- నందికొట్కూరు మండలంలో పురుషులు 31,662 గాను 27,452, మహిళలు 33,459, ఇతరులు 08 మొత్తం 55,511 మంది ఓటు వేయగా పోలింగ్ 85.23 శాతం నమోదయ్యింది.
- పగిడ్యాల మండలంలో పురుషులు 13,214 గాను 11,346, మహిళలు 13,847 గాను 11,633 మంది ఓట్లు వేయగా 84.01 శాతం పోలింగ్ నమోదయ్యింది.
- పాములపాడు 16,777 గాను 14,111, మహిళలు 17,305 గాను 14,339, ఇతరులు 02 ఓట్లు వేయగా మొత్తం 83.47 శాతం పోలింగ్ నమోదయ్యింది.
- నియోజకవర్గంలో పురుషులు మొత్తం 1,06,689 గాను 91,934 మంది, మహిళలు 1,11,340 గాను 92,940 మంది ఓట్లు వేయగా, ఇతరులు 12 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 84.79 శాతం పోలింగ్ నమోదయ్యింది. పురుషుల కంటే 4,651 మంది మహిళల ఓట్లు అధికంగా పోలయ్యాయి.

నేలకొరిగిన వృక్షం.. నిలిచిన రాకపోకలు



నేలకొరిగిన వృక్షం, నిలిచిపోయిన వాహనాలు

మహానంది: మంగళవారం వీచిన భారీ గాలులుకు బండిఆత్మకూరు నుంచి నంద్యాలకు వెళ్లే మార్గంలో ఏ.కోడూరు, పార్నపల్లె గ్రామాల మధ్య ఓ పెద్ద వృక్షం నేలకొరిగింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వెంటనే స్పందించిన బండిఆత్మకూరు ఎస్ఐ మల్లికార్జున, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని డోజర్‌తో చెట్టును పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

స్నేహమంటే ఇదేరా...!



శునకం మృతితో వాహనాలు వెళ్తుండగా అరుస్తున్న శునకాలు

మహానంది: సాటి మనిషి రోడ్డు పక్కన పడితే ఏమైందో చూడకుండా వెళ్లిపోయే వారు ఎందరో ఉన్నారు. రక్తపు గాయాలతో పడి ఉంటే మనకెందులే రిస్క్ అంటూ చూసీ చూడనట్లు వెళ్లేవారు మనకు తారసపడుతుంటారు. అయితే విశ్వాసానికి మారుపేరైన శునకాలు మాత్రం తోటి శునకం వాహనం కింద పడి మృతి చెందితే చూసి వేదనతో రగిలిపోయాయి. అటుగా వచ్చి వెళ్లే వాహనాల మీదికి భౌభౌ అంటూ పరిగెత్తుతూ మళ్లీ మృతి చెందిన శునకం వద్దకు చేరిన దృశ్యాలు కంటతడి పెట్టించాయి. ఈ హృదయ విదారక ఘటన నందిపల్లె వద్ద కనిపించింది.

24 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రీ వెరిఫికేషన్, తప్పిపోయిన సబ్జెక్టులకు ఫీజు చెల్లింపు తేదీల గడువు ముగిసిందన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

బండిఆత్మకూరులో అత్యధిక ఓటింగ్

- శ్రీశైలంలో అత్యల్పం
- కొన్ని గ్రామాల్లో రాత్రి 10 వరకు పోలింగ్



తిమ్మాపురంలో ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సరళి ఓ దశలో కొన్ని మండలాల్లో భారీగా జరగగా, మరికొన్ని మండలాల్లో ఓ మోస్తరుగా జరిగింది. నియోజకవర్గంలోని బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా పోలింగ్ జరగగా, శ్రీశైలంలో అత్యల్పంగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని శ్రీశైలం, ఆత్మకూరు, బండిఆత్మకూరు, మహానంది, వెలుగోడు మండలాల్లో దాదాపు 1,96,116 మంది ఓటర్లు ఉండగా, ఇందులో 1,62,796 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు, మహిళల తీరును పరిశీలిస్తే పురుషులు 95,771, మహిళలు 1,00,301 మంది ఓటు వేశారు.హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 83 శాతం పోలింగ్ నమోదయ్యింది.

మండలాల వారీగా పోలింగ్..

- బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా 89 శాతం పోలింగ్ జరగగా, 37,974 మందిని ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 26,550 మంది, మహిళలు 17,001, ఇతరులు నలుగురు ఉన్నారు.
- ఆత్మకూరు మండలంలో మొత్తం ఓటర్లు 63,173 మంది ఓటుహక్కును వినియోగించుకోగా, ఇందులో పురుషులు 25,976, మహిళలు 26,550, ఇతరులు 13 మంది ఉండగా.. 83.01 శాతం పోలింగ్ నమోదయ్యింది.
- మహానంది మండలంలో మొత్తం ఓటర్లు 29,760 మందికి గాను పురుషులు 12,574 మంది, మహిళలు 13,022 మంది, ఇతరులు ఏడుగురు చొప్పున, 25,603 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ మండలంలో 86 శాతం పోలింగ్ జరిగింది.
- వెలుగోడు మండలంలో మొత్తం 42,344 మందికి గాను 16,761 మంది పురుషులు, 17,625 మంది మహిళలు ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం 34,385 మంది ఓటు వేయగా.. 81.2 శాతం పోలింగ్ నమోదయ్యింది.
- శ్రీశైలం మండలంలో మొత్తం ఓటర్లు 22,865 మంది ఉండగా, 8,177 మంది పురుషులు, 8,218 మంది మహిళలు, మొత్తం 16,316 మంది ఓటుహక్కును వినియోగించుకోగా.. 71.7 శాతం పోలింగ్ జరిగింది.
- ఆత్మకూరు పట్టణం, మండలంలోని అమలాపురంలో రాత్రి 10 గంటల వరకు, బండిఆత్మకూరు మండలం లింగాపురం, మహానంది మండలం గాజులపల్లెలో కూడా పోలింగ్ రాత్రి వరకు జరిగింది.

మహిళల ఓట్లే అధికం

మహానంది: మహానంది మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఎన్నికల పోలింగ్‌లో మహిళలే అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహానంది మండలంలో మొత్తం 29,760 మంది ఓటర్లు ఉండగా 13,022 మంది మహిళా ఓటర్లు, 12,574 మంది పురుష ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా 86.03 శాతం పోలింగ్ జరగడం విశేషం. గాజులపల్లె, గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామాల్లో రాత్రి పది వరకు వర్షాన్ని లెక్కచేయకుండా క్యూలో నిల్చుని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మహానంది మండలంలో గ్రామాల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
తిమ్మాపురం	3,202	2,793
మహానంది	2,294	1,798
అల్లినగరం	1,053	938
బుక్కాపురం	1,960	1,690
బొల్లవరం	2,327	2,129
అబ్బీపురం	1,990	1,731
తమ్మడపల్లె	1,709	1,486
మసీదుపురం	1,676	1,564
సీతారామాపురం	1,488	1,371
నందిపల్లె	834	768
గోపవరం	2,618	2,247
గాజులపల్లె ఆర్ఎస్	1,188	1,063
గాజులపల్లె	6,471	6,025

సెలవులను సద్వినియోగం చేసుకుందాం

- వేసవి సెలవుల్లో చిన్నారుల్లో పెరిగిన మొబైల్ వీక్షణం
- రోజుకు సగటున 3 గంటలకు పైనే
- క్రీడా శిక్షణపై దృష్టి మరల్చితే మేలు



విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): వేసవి సెలవులు వచ్చాయంటే చాలు. పిల్లలకు ఎక్కడ లేని ఆనందం.. ఏడాది పాటు తీరిక లేకుండా చదివిన తమ పిల్లలకు కాస్త తీరిక దొరికిందని తల్లిదండ్రులకు సంతోషం. ఒకవైపు సెలవుల్లో మొబైల్ ఫోన్ అతిగా వాడడం, అల్లరి చేష్టలతో ఎక్కడ ఆరోగ్యం మీదకు తెచ్చుకుంటారోనని ఆందోళన మరోవైపు ఉంటోంది. ఈ మధ్యకాలంలో 69 శాతం మంది పిల్లలు రోజుకు సగటున మూడు గంటల కంటే ఎక్కువ సమయాన్ని మొబైల్ వీక్షించడానికి కేటాయిస్తున్నారని ఓ సర్వేలో వెల్లడైంది. 96 శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్ వైపు ఆకర్షితులు కాకుండా ఉండడానికి ఏం చేయాలో తెలుసుకోవడానికి ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారని మరో సర్వే ద్వారా తెలుస్తోంది. గతంలో విహార యాత్రలకు, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లడం చేసేవారు. ప్రస్తుతం అది చాలా వరకూ తగ్గింది. సెలవుల్లో పిల్లలు ఆసక్తి కనబరిచే క్రీడల్లో శిక్షణ అందిస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

పెరిగిన సెల్‌ఫోన్ వినియోగం

కరోనా సమయంలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించడంతో చాలామంది పిల్లలకు మొబైల్ ఫోన్ అందుబాటులోకి వచ్చింది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగస్తులు కావడం, మరికొందరు జీవనోపాధి నిమిత్తం పనులకు వెళ్లిన సందర్భాల్లో పిల్లల క్షేమ సమాచారం కోసం సెల్‌ఫోన్లను తమ చిన్నారులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పదేళ్లలోపు పిల్లలు 42 శాతం, 10–12 ఏళ్ల పిల్లలు 71 శాతం, 12–14 ఏళ్ల లోపు వారు 91 శాతం వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కలిగి ఉంటున్నారని సమాచారం. దీంతో సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుతూ, సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. ఇటీవల కాలంలో చిన్నారులు ఎక్కువగా ఆటిజం సమస్యకు గురవుతున్నారు. మొబైల్ గేమ్ ఎడిక్షన్‌కు లోనవుతున్నారు. ఇలాంటి సమస్యలు రాకుండా ముందుగానే పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టాలి.

క్రీడా శిక్షణ శిబిరాలు...

విద్యార్థులకు వివిధ క్రీడాంశాలపై ఉచితంగా శిక్షణ అందించేందుకు జిల్లా యువజన క్రీడల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాల వారీగా క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానించే పనిలో ఉన్నారు. మే 1 నుంచి 31 వరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, బాక్సింగ్, వాలీబాల్, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ తదితర క్రీడలపై శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శిక్షణ పూర్తయ్యాక ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు.

ఇలా చేయాలి..

చిన్నారులకు ఫోన్ ఇచ్చే సందర్భంలో యూట్యూబ్ కిడ్స్ మాత్రమే ఓపెన్ చేయాలి. ఇన్‌స్టాగామ్, అడల్ట్ యాప్స్, సోషల్ మీడియా యాప్స్ ఓపెన్ కాకుండా యాప్ లాక్స్ వేసుకోవాలి. పజిల్ గేమ్స్, వర్డ్ బిల్డింగ్, గణితం పజిల్స్ తదితర యాప్స్ మాత్రమే చిన్నారులు వినియోగించేలా చూడాలి. పెద్ద పిల్లల విషయంలో కచ్చితంగా తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం. స్మార్ట్ ఫోన్ కంపెనీలు ఫోన్లలో పేరెంటల్ కంట్రోల్ అనే ఆప్షన్ అందుబాటులోకి తెచ్చాయి.

రేడియేషన్ బారిన పడొద్దు



సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగిస్తే పెద్దవాళ్లపైనా ప్రభావం పడుతుంది. చిన్నపిల్లల్లో కంటి చూపుపై ప్రభావం ఉంటుంది. నిద్రలేమి సమస్య రావచ్చు. చాలామంది తల్లిదండ్రులు పిల్లల చేతుల్లో గంటల పాటు ఫోన్ ఉంచుతున్నారు. అలా చూడడం వల్ల పిల్లల మెదడుపై రేడియేషన్ ప్రభావం పడుతుంది. కంటితో పాటు వెన్ను సమస్యలు వస్తాయి. సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడటం వల్ల మానసిక ఎదుగుదల లోపిస్తుంది. చలాకీ తనం తగ్గుతుంది. కంటి సమస్యలు, మెడలో కండరాల బలహీనత ఏర్పడుతుంది. పిల్లలు ఇండోర్, అవుట్‌డోర్ గేమ్‌లు ఆడే విధంగా తల్లిదండ్రులు చూడాలి. సెలవుల్లో పిల్లలను పిక్నిక్‌లకు, వినోదాలకు తీసుకువెళ్లడం మంచిది.

–డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ

అతిగా వినియోగిస్తే అనర్థం



అతిగా సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థాలే. ఇది జ్ఞాపక శక్తిపై కూడా ప్రభావితం చూపుతుంది. తలనొప్పి, బ్యాక్ పెయిన్ సమస్యలు వస్తాయి. చికాకు, అసహనం, కోపం, తిరుగుబాటు ధోరణి పెరుగుతుంది. 5–6 ఏళ్ల వయసులో సహజంగా మెదడు ఎదుగుదల ఉంటుంది. ఆ సమయంలో చిన్నారులకు స్క్రీన్ టైమ్ ఎక్కువగా ఉంటే మెదడు ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. ఇప్పుడు ప్రతి 10 మంది చిన్నారుల్లో ముగ్గురికి ఆటిజం లక్షణాలు కనిపిస్తున్నాయి.

– ఆరిఫాబాను, సైకాలజిస్ట్, నంద్యాల

ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



పిల్లల కోసం ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ ఏడాది 50 శిబిరాల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాం. దీని కోసం అందుబాటులో ఉన్న కోచ్‌లు, మౌలిక వసతులు, ఆసక్తి ఉన్న పీడీల వివరాలు సేకరిస్తున్నాం. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న గేమ్స్, అథ్లెటిక్స్ ఆధారంగా శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్ర యువజన క్రీడల ఉన్నతాధికారుల ఆమోదం పొంది శిబిరాలను ప్రారంభించాం.

– రాజు, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి, నంద్యాల